# ఉగ్గుగిన్నె

"బొట్టెడుట్టిండు కదా ఉగ్గుగిన్నె ఒట్రా, మావాఁ" సింహాచలం పని లోకి వెళ్ళబోతుంటే గుడిసె బైటికొచ్చి మరీ చెప్పింది సీతాలు.

"అట్టాగాలే యాదుందిలే. సందేళ కొట్టుకొస్తా. గానీ ఈ సలి గాలిలో తిరగమోకు బుడ్డాడికి పడిసం బడ్తది. లోపలికెళ్ళే" అంటూ వెళ్ళి పోయాడు.

సీతాలు గుడిసెలోకెళ్ళి తలుపేసుకుంది. పిల్లోడి ప్రక్కన మంచం మీద కూర్చుంది. ఆ పసిగుడ్డుని చూసుకొని మురిసిపోతోంది. ఆమెలో మాతృప్రేమ పొంగి వస్తుంటే పిల్లాడ్ని తీసి పొత్తిళ్ళలో పొదుక్కుంది. సింహాచలం తనను చేపట్టినప్పటి నుంచి తనకొక బిడ్డ కావాలని వాంఛ. ఎన్నో కలలు కంది—తను తల్లి కావాలని: బిడ్డను పొత్తిళ్ళలో పొదుక్కుని పాలిచ్చి లాలించి ఉగ్గెట్టి ఉయ్యాలలూపాలని. తను కన్న కలలన్నీ ఇప్పటికి ఫలించాయి. తన బిడ్డ దొర బిడ్డలా ఉన్నాడు. తన మొక్కులన్నీ ఫలించాయి. భగవంతుడు చల్లగా చూసేడు. తనకు నిజంగానే పండంటి బిడ్డనే ఇచ్చేడు. తనకున్న మరో కోరికే ఇక తీరాలి. తన మావ ఎలాగైనా ఇవేళ ఉగ్గుగిన్నె తెస్తే ఆ కోరిక కూడా తీరిపోతుంది.

"కూడిదిగోనే, సీతాలూ" గుడిసె తలుపు తోసుకొని వచ్చింది రత్తాలు. సీతాలు అన్నం తింటుంటే రత్తాలు పిల్లాణ్ని ఎత్తుకొని ముద్దాడు తోంది.

"నీ భాగ్యం గొప్పదే. బంగారు కొండంటి బిడ్డడుంటిండు. అంతా ఆ యెంకన్న దయే. ఆ సామి సల్లంగ చూసిండు."

"అదికాదే రత్తీ. నాకో కోరికుండి పోనాదె. తళతళ మెరిసే బంగారు ఉగ్గుగిన్నెలో మాబొట్టెడి కుగ్గట్టాలే" రత్తాలు తెల్లబోయింది.

"పిచ్చిమాలోకమా. అట్టాటాసలు ఏట్టా తీరుతాయే మన బోటోళ్ళకి."

"అదికాదే రత్తీ. వీడుట్టకముందే మామతో సెప్పినా. అట్టాగానే ఓ బొట్టెడుట్టనీ సూద్దాం అన్నాడే. ఇప్పుడు బొట్టెడుట్టాండు కదా. పొట్టుకు రా మావా అంటే అట్టాగేనే సందేళకు పొట్టుకొస్తానన్నాడు.

ఆ ముచ్చట చెప్పినప్పుడు సీతాలు ముఖంలో సంతోషం చోటు చేసుకొంది. చీకటి పడేసరికి గుడిసె చేరుకున్నాడు.

సింహాచలాన్ని చూస్తూనే సీతాలు "ఒట్టుకొచ్చినావా, మాఁవా ఉగ్గు గిన్నె" అంది.

ఉగ్గుగిన్నె చూసేసరికి సీతాలు ఆనందమంతా మాయమైపోయింది. "నీకేటి సెప్పిన్ను. మాఁవా నీకేటి సెప్పిన్ను...."

"ఏటి సెప్పిన్నావె. ఉగ్గుగిన్నొట్టుకు రమ్మన్నావు. అట్టాగే సేసిన్ను, ఈ గిన్నెతో బొట్టెడు కుగ్గట్టవె."

"సీ. ఏటిమాఁవా. ఈడుట్టకముందె సెప్పిన్ను కదా. బంగారు ఉగ్గు గిన్నెతో ఉగ్గట్టాలని ఉందని."

శీతాలు మాటకు సింహాచలం పగలబడి నవ్వాడు.

"బాగుందే. బంగారు ఉగ్గుగిన్నెలెట్టా వస్తాయే.నీ బొంద. బొట్టెడ్క ఉగ్గటి పాలెట్టి బుస్సేట్టి పెద్దోడ్ని సేత్తే సాలదటే మన బోటోళ్ళకదే పదేలు" సింహాచలం మాటలు వినేస్థితిలోలేదు సీతాలు. ఆమె మనస్సు చెదిరిపోయింది తన కోరిక తీరనందుకు దుఃఖం పొంగి వస్తోంది. ప్రతి రూపంగా ఆ కళ్ళు వర్షించడం మొదలు పెట్టాయి. "ఏటే పిచ్చి మాలోకమా—ఏడుత్తావు? ఇప్పుడేటయిందే. ఇట్టాటి తీరని ఆశలు ఎట్టుకో కూడదే" సీతాలు కళ్ళు తుడిచి ఎంతగానో నచ్చచెప్పేడు సింహాచలం.

తన కడుపుపంట బోసినవ్వులతో మురిపిస్తున్నా. చిలిపి కళ్ళతో పలకరిస్తున్నా, పున్నమి చంద్రుడిలా పెరుగుతున్నా సీతాలు తన కోరిక మటుకు మరచిపోలేక పోతోంది. బొట్టోడ్ని ప్రక్క గుడిసెలో ఉంటున్న రత్తాల కప్పచెప్పి నాలుగు రోజులుగా పనిలోకి పోతోంది.ఆమె మనస్సును కలవరపరుస్తున్న కోరిక మరుగుని పడిపోతుందేమో అన్నట్టు ఓ దృశ్యం సీతాలు కంటపడింది. చెప్పారప్పకుండా సుకుమారి. ఆమె ఒళ్ళో పిల్లాడిని చూస్తూ ఉండిపోయింది. సుకుమారి చేతుల్లో బంగారపు ఉగ్గుగిన్నె మెరుస్తోంది. దానితోనే పిల్లాడికి ఉగ్గుపడుతోంది. సీతాలు మనస్సులో ఏదో కలుక్కుమంది. "ఎంత అదృష్టవంతురాలో. బంగారు గిన్నెతో ఉగ్గు పడుతోంది బాబుకు." తనూ అనుకుంది బాబు పుట్టకముందే నుంచి ఇలాగే తన బాబు బంగారుగిన్నెతో ఉగ్గు తాగాలని. కాని తన కోరిక తీరనిది. ఇలాంటి ఆలోచనలతో బరువెక్కింది సీతాలు హృదయం. పని పూర్తి చేసు కొని గుడిసె చేరుకున్న తనకు సుకుమారి, ఆమె చేతిలోని బంగారు ఉగ్గు గిన్నె పసిబిడ్డ. తన కళ్ళలో మెదులుతున్నాయి. తన ఆశ ఇక ఈ జన్మకు తీరదు. తన కోరిక తీరకుండానే బాబు పెద్దవాడై పోతాడు.కాని ఏలాగైనా ఒక్కసారైనా తన బిడ్డకు బంగారు గిన్నెతో ఉగ్గు తాగించాలి. అందుకు

తనేమైనా చెయ్యాలి. ఇలా ఆలోచిస్తున్న సీతాలు మనసులో ఓ ఊహ మెరిసింది. మరునాడు ఎప్పటిలా పనిలోకి వెళ్ళింది. తనను ఎవ్వరూ గమనించని సమయం చూసి ఉగ్గుగిన్నె తీసి మొలలో పెట్టుకుంది. త్వరగా పని ముగించుకొని గుడిసె చేరుకుంది. పిల్లాడు బోసినవ్వు లొలక బోస్తున్నాడు. ఆడుతున్నాడు. కేరింతలు కొడుతున్నాడు. తన కోరిక తీరబోతోందని ఏమో ఈరోజు సీతాలుకు మరీ ముద్దుగా కనిపిస్తున్నాడు తన బిడ్డ. ఎలాగయితేనేం తను బంగారు ఉగ్గుగిన్నె సంపాదించగలిగింది. తను తెచ్చిన ఉగ్గుగిన్నెను తనివితీరా చూసుకుంది. కోరిక తీరుతున్న ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవుతోంది సీతాలు హృదయం. పిల్లోడ్ని ఒళ్ళో వేసుకుంది. గిన్నెలో ఉగ్గుపోసి పట్టబోయింది. ఆమె చేతులు వణికాయి. తన బిడ్డ పరమాత్ముడిలా కనుపిస్తున్నాడు. దొంగిలించి తెచ్చిన ఉగ్గుగిన్నెతో ఉగ్గుపట్టి నన్ను పెంచుతావా అని అడుగుతున్నట్టు అనిపిస్తోంది. చేతుల్లో ఉన్న బంగారు గిన్నె జారి పడిపోయింది. దానిని చేతుల్లోకి తీసుకోవాలని మళ్ళా ఆ గిన్నె ఉగ్గుతో నింపి బాబుకు పట్టాలని అనిపించలేదు సీతాలుకు. సత్యానికి, ధర్మానికి ఉన్న పవిత్రస్థానం ఆమె మనస్సులో కొద్దిసేపు పేరుకున్న మలినాన్ని క్షాళనం చేసింది. వీల్లేదు—తను దొంగిలించి తెచ్చిన బంగారు గిన్నెతో ఉగ్గుపట్టి తన బాబును పెంచడానికి వీల్లేదు. తన మావ కష్టపడి తెచ్చిన సంపాదన డబ్బుతో కొన్న గిన్నె చాలదా—తన బాబు ఉగ్గు తాగేందుకు! మావ తెచ్చిన గిన్నె, బంగారు గిన్నె మార్చి మార్చి చూస్తోంది. మావ తెచ్చిన సిలవరి ఉగ్గుగిన్నె బంగారు ఉగ్గుగిన్నెకన్న ఎన్నోరెట్లు విలువైందిగా తోచింది సీతాలుకి. మధ్యాహ్నం పనిలోకి పోయేటప్పుడు బంగారు గిన్నె తన మొలలో పెట్టుకుంది. సుకుమారి ఓ కథ వ్రాసుకుంటూనే సీతాలుని గమనిస్తోంది. అంట్లు తను ఊహించినట్టుగానే జరిగింది. తోమిన గిన్నెలు కడిగి లోపల పెడుతూ వాటి మధ్యన ఉగ్గుగిన్నె కూడా పడేసింది. సుకుమారిలోని రచయిత్రి ఆమెను తొందరపెట్టింది. "ఆ అమాయకురాలి కోరిక తీర్చు అప్పుడు

ఆమె కళ్ళలో పెల్లుబికే ఆనందాన్ని నీ కళా హృదయంతో చూడు.. అంటూ ఆ బంగారు గిన్నె తీసుకొని ఇల్లు ఊడుస్తున్న సీతాలు దగ్గరకు వచ్చింది.

“ఇదిగోనే సీతాలూ—ఇది నేను మీ అబ్బాయి కిస్తున్న కానుక” ఉగ్గుగిన్నె సీతాలు చేతుల్లో పెట్టబోయింది. షాక్ తగిలినదానిలా చెయ్యి వెనక్కి తీసుకుంది సీతాలు.

“ఎందుకే అలా బెదిరిపోతావు? నీ మనసు నాకు తెలుసును. మీ బాబు పెద్దవాడై పోతున్నాడు. అసలు ఈ ఉగ్గుగిన్నె నీకిచ్చివేదామనే అనుకుంటున్నాను. నువ్వు తల్లివి కాకముందే నీలో మొలకెత్తిన కోరిక నాకు తెలుసు. ప్రొద్దున్న గిన్నె నువ్వు తీసుకొని వెళ్ళడం నాకు తెలుసు. కాని నేను అప్పుడే అనుకున్నాను నువ్విలా చేస్తావని. మంచి మనసుకు మలినం అంటదే సీతాలూ. ఇప్పుడు నేనే నీకు బహుమతిగా ఇస్తున్నా తీసుకో” ఉగ్గుగిన్నె సీతాలుకు అందివ్వబోయింది.

“పెద్దమ్మగారూ నా పిచ్చాశలు మరచిపోతాలెండి. బంగారు గిన్నెతో ఉగ్గట్టే అంతదాన్ని కాను. నాకు. నాకు తీరని ఆశ పెంచు కున్నందుకే సిగ్గవుతోంది. శమించండమ్మగోరూ ఎప్పుడిట్టాటి పొరపాటు సెయ్యను” సీతాలు కళ్ళు చెమర్చాయి. ఆ రెండు మాతృ హృదయాలూ మరింత దగ్గరయ్యాయి. తన బాబుకు బంగారు ఉగ్గుగిన్నెతో ఉగ్గు పట్టాలని కోరిక తనకూ ఉండేది కాని అది క్షణాలలో తీరిపోయింది. మరి సీతాలుకూ అదే కోరిక. కాని అది తీరనిదిగా మిగిలిపోయింది. అలా ఎందుకు

మిగలాలి? అందుకే నిండు మనసుతో బంగారు గిన్నెను తన పనిమనిషి సీతాలుకు బహూకరించింది సుకుమారి. ఇప్పుడు సీతాలు చేతుల్లో బంగారు ఉగ్గుగిన్నె మెరుస్తోంది. అది ఎప్పటికీ దానిదే. తృప్తిగా నవ్వుకుంది సుకుమారి. ఆమె కళ్ళు వింతకాంతితో మెరుస్తున్నాయి. సీతాలుకు తెలియకుండానే తనలో బలపడిపోయిన అనర్హమైన కోరిక సుకుమారి ఔదార్యంతో తీరిపోయింది.

* * *